'కులగణన'పై కేంద్రం స్పష్టతనివ్వాలి

- 20న జరిగే సార్వత్రిక సమ్మెకు సిపిఎం మద్దతు
- కేంద్ర బలగాలను వెనక్కి రప్పించి మావోయిస్టులతో చర్చలు జరపాలి
- సామాజిక, ఆర్థిక అసమానతలు తగ్గించాలి
- ఎన్నికలకు ముందు సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కుల గణన చేయడానికి నిర్ణయించిన నేపథ్యంలో దాన్ని ఎప్పటిలోగా పూర్తి చేస్తారో స్పష్టంగా ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. కగార్ చర్యలను వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని తెలిపారు. సామాజిక, ఆర్థిక అసమానతలు, కుల వివక్షతను రూపుమాపేందుకు విద్యా, వైద్యం ప్రతి ఒక్కరికి ఉచితంగా అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి చట్టాలకు వ్యతిరేకంగా మే 20న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. ఆదివారం తెలంగాణ పోరాటయోధుడు కందికొండ రామస్వామి సంస్మరణ దినోత్సవం సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లాకు వచ్చిన జాన్‌వెస్లీ.. కల్వకుర్తి పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా జరగనున్న కులగణనలో ముస్లింలను బీసీల్లో చేర్చకూడదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించడం సరికాదని, ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్య అని అన్నారు. కేంద్ర బలగాలను దండకారణ్యంలో మావోయిస్టులపై ఉసిగొల్పి వారిని ఎన్‌కౌంటర్లు చేయడం అప్రజాస్వామిక చర్య అని తెలిపారు. కర్ర గుట్టలో మావోయిస్టులను చుట్టుముట్టిన పారా మిలటరీ బలగాలను వెంటనే వెనక్కి పిలిపించి, మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామని కేంద్ర హోం మంత్రి ప్రకటించడం సరైనది కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ నూటికి నూరు శాతం అమలుచేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడంతోపాటు స్థలాలు లేని వారికి ప్రభుత్వ భూముల్లో ఇల్లు నిర్మించి ఇవ్వాలని తెలిపారు. కేరళ తరహాలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్ కార్డుకు 14 నిత్యవసర సరుకులు ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అందాల పోటీలతో విదేశీ పెట్టుబడులు రావని, వారికి మౌలిక వసతులు కల్పించి పెట్టుబడులు రప్పించాలని కోరారు. రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు సమ్మెకు వెళ్లకుండా కార్మిక సంఘాలతో చర్చించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈనెల 20న జాతీయ కార్మిక సంఘాలు నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్థం పర్వతాలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసులు, కందికొండ గీత, దేశనాయక్, ఆంజనేయులు, నాయకులు నరసింహ పాల్గొన్నారు.

జాన్ వెస్లీని ప్రజాసంఘాల సన్మానం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా నియామకం అయిన తర్వాత తొలిసారి నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యటనకు రావడంతో కల్వకుర్తి పట్టణంలో సిపిఎం, సిఐటియు, టిఎస్‌యుటిఎఫ్, భవన నిర్మాణ కార్మిక సంఘం, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్, తదితర కార్మిక సంఘాల నాయకులు జాన్‌వెస్లీకి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు అంజనేయులు, సీనియర్ నాయకులు ఏపీ మల్లయ్య, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పరశు రాములు, టిఎస్ యుటిఎఫ్ నాయకులు చిన్నయ్య, నెహ్రూ ప్రసాద్, వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఉపాధ్యాయులు టి చెన్నయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌లో కనిష్ట నీటిమట్టం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగార్జునసాగర్ జలాశయం కనిష్ట నీటి మట్టానికి చేరువైంది. ఆదివారం ఉదయం వరకు అందిన సమాచారం ప్రకారం.. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి వరద నీరు నిలిచిపోగా.. సాగర్ నుంచి ఎస్ఎల్‌బిసి ద్వారా 1,350 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 590.00 అడుగులు కాగా.. కనిష్ట నీటి మట్టం 510.00 అడుగులు. కుడి, ఎడమ కాల్వ, ప్రధాన విద్యుత్తు కేంద్రాల ద్వారా నీటి విడుదలను నిలిపేశారు. జలాశయ నీటిమట్టం ప్రస్తుతం 514.00 అడుగులు కాగా.. నీటి సామర్థ్యం 138.5610 టిఎంసిల వద్ద ఉంది.

8 వరకు వర్షసూచన

- నేడు, రేపు పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఈ నెల ఎనిమిదో తేదీ వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈదురుగాలులతో (గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో) కూడిన వర్షం పడే సూచనలున్నాయనీ, అదే సమయంలో అక్కడక్కడా వడగండ్లు పడే అవకాశముందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. ఆ జాబితాలో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలున్నాయి. మిగతా జిల్లాల్లోనూ అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. వర్షాల నేపథ్యంలో వాతావరణం చల్లబడటంతో గరిష్ట ఉష్ణోగ్రతలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఆదివారం రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో వందకుపైగా ప్రాంతాల్లో వర్షం పడింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలో అత్యధికంగా 5 సెంటీమీటర్ల వాన పడింది.

నేటి నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

- నలుగురు సభ్యుల బృందం చొప్పున రెండువందల మంది శాస్త్రవేత్తలు
- 1200 గ్రామాల్లో పర్యటించనున్న బృందాలు
- రైతులను వానాకాలానికి సంసిద్ధం చేసేందుకు చర్యలు
- కార్యక్రమ పర్యవేక్షణ కోసం నోడల్ అధికారుల నియామకం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని రైతాంగానికి సాగు సంబంధిత అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే నూతన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని మే 5 నుంచి జూన్ 13 వరకు రాష్ట్రంలోని సుమారు 1200 గ్రామాలలో నిర్వహిస్తామని తెలిపారు. ఆదివారం ఈమేరకు మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. సుమారు 200 పైగా శాస్త్రవేత్తల బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. దక్షిణ తెలంగాణ మండలాల్లో సుమారు 100 బృందాలు, ఉత్తర మరియు మధ్య తెలంగాణ మండలాల్లో సుమారు 50 బృందాలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఒక్కో బృందం వారి రోజువారి కార్యక్రమాన్ని నిర్వహించడంతోపాటు, వారంలోని పని దినాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎంపిక చేసుకున్న గ్రామాల్లోని రైతు వేదికల్లోగానీ, మరే ఇతర సౌకర్యవంతమైన ప్రదేశంలోగానీ రైతులకు యూరియా వాడకం తగ్గించడం, రసాయనాలను జాగ్రత్తగా వాడటం, చెల్లింపు రశీదులను భద్రపరచడం, సాగు నీటి ఆదా, పంటల మార్పిడి, చెట్లను పెంచటంపై అవగాహన కల్పిస్తారని వివరించారు. ఈ అంశాలతోపాటు రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ళకు సూచనలు, సలహాలు అందజేస్తారని తెలిపారు. ఒక్కో బృందంలో ఇద్దరు శాస్త్రవేత్తలతోపాటు వ్యవసాయ విద్యార్థులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఇతర స్థానిక ప్రభుత్వ అధికారులు, అభ్యుదయ రైతులు, సంఘాలు పాల్గొంటాయని పేర్కొన్నారు. అలాగే స్థానిక ప్రజా ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేయడం జరుగుతోందని గుర్తు చేశారు. కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయంలోని అన్ని వ్యవసాయ కళాశాలలు, పాలిటెక్నిక్స్, వ్యవసాయ పరిశోధనా సంస్థలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు, వ్యవసాయ శాఖ సహకారంతో నిర్వహిస్తామని తెలిపారు. విశ్వవిద్యాలయంలోని ఉన్నత స్థాయి అధికారులతోపాటు వివిధ మండలాల్లోని సహ పరిశోధనా సంచాలకులు, కళాశాలల డీన్లు దీనిని పర్యవేక్షిస్తారని వివరించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా శాస్త్రవేత్తలకు, విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అన్నదాతలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తెలుసుకునే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు గతంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందనీ, కాని గత ప్రభుత్వాలు వాటిని పట్టించుకోనందున రైతులు ఇలాంటి అవకాశాలను దూరం చేసుకున్నారని తెలిపారు. కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల శ్రేయస్సు కోసం, రైతులకు వ్యవసాయ సంబంధిత వివిధ అంశాలపై అవగాహన కల్పించే దిశగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని తీసుకొస్తున్నామని వెల్లడించారు. రైతులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వారికి వ్యవసాయ సంబంధిత అంశాలపై గల అనుమానాలను శాస్త్రవేత్తల ద్వారా నివృత్తి చేసుకోవాలని కోరారు.

'నీట్' ప్రశాంతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంబిబిఎస్ ప్రవేశాల కోసం చేపట్టే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష(నీట్-యూజీ 2025) ఆదివారం తెలంగాణ రాష్ట్రంలో ప్రశాంతంగా జరిగింది. గతేడాది 'నీట్' ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో ఈసారి పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్‌టిఎ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలో 'నీట్' పరీక్ష 24 పట్టణాల్లో 190 కేంద్రాల్లో జరిగింది. హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 62 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 72,507 మంది రాష్ట్ర విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేశారు.

పరీక్ష మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయింది. మధ్యాహ్నం 1.30 గంటలలోపు వరకే విద్యార్థులను కేంద్రంలోకి అనేమతించారు. ఆతర్వాత వచ్చిన వారిని నిలిపివేశారు. గడియారాలు, బూట్లు, ఇతర గ్యాడ్జెట్లు, నిషేధిత పదార్థాలను తీసుకెళ్లకుండా తనిఖీలు నిర్వహించారు. గతేడాది రాష్ట్రంలో నీట్ దరఖాస్తులు 79,813 రాగా, ఈసారి 7,306 తగ్గడం గమనార్హం.

3 నిమిషాలు ఆలస్యం...

నీట్ పరీక్షకు మూడు నిమిషాలు ఆలస్యంగా రావడంతో ఓ విద్యార్థిని పరీక్ష రాయలేకపోయింది. ఆమె తల్లి ఎంత బతిమిలాడినా పరీక్ష రాసేందుకు అధికారులు అనుమతించలేదు. తన కుమార్తెను పరీక్ష రాసేందుకు అనుమతించాలని ఎంతగా ప్రాధేయపడినా అధికారులు అంగీకరించకపోవడంతో విద్యార్థిని తల్లి కన్నీరుమున్నీరయ్యారు. కరీంనగర్‌లోని మహిళల డిగ్రీ, పీజీ కళాశాలలో నీట్ పరీక్ష రాసేందుకు వేములవాడ నుంచి తన తల్లితో విద్యార్థిని బయల్దేరింది. మూడు నిమిషాలు ఆలస్యంగా పరీక్ష కేంద్రానికి చేరుకుంది. విషయాన్ని అక్కడి అధికారులకు చెప్పి బతిమిలాడినా వారు కనికరించలేదు. కూలీ పని చేసి, తన పుస్తెలతాడు పెట్టి లోన్ తీసుకొని తన కుమార్తెను లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు పంపించానని.. ఒక మంచి హోదాలో చూస్తానని కలలు కన్నానని.. కానీ దురదృష్టవశాత్తూ ఆ ఆశలన్నీ అడియాశలయ్యాయని ఆ తల్లి విలపించిన తీరు కలచివేసింది.

నేడు ఆర్‌టిసి కార్మికుల కవాతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి కార్మికుల సమ్మె సన్నాహకాల్లో భాగంగా సోమవారం కార్మిక కవాతు నిర్వహిస్తున్నట్టు కార్మిక సంఘాల జెఎసి చైర్మెన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మెన్ కే హన్మంతు ముదిరాజ్, కన్వీనర్ ఎమ్ థామస్‌రెడ్డి తెలిపారు. బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కళ్యాణమండపం నుంచి బస్‌భవన్ వరకు ఈ కవాతు జరుగుతుందన్నారు. ఈనెల 7 నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెలోకి వెళ్లడం తథ్యమనీ, ప్రభుత్వం, యాజమాన్యం ఇప్పటి వరకు చర్చలకు ఆహ్వానించలేదని వివరించారు. చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తే, సమ్మె కొనసాగిస్తూనే, చర్చల్లో పాల్గొంటామని తేల్చిచెప్పారు. పెరిగిన పనిభారాలు, ఆర్థిక వత్తిళ్లతో కార్మికులు తీవ్ర నిరాశా, నిస్పృహల్లో ఉన్నారనీ, సమ్మెకు సిద్ధంగా ఉన్నామని ఇప్పటికే ప్రతినబూనారని చెప్పారు. ఆర్‌టిసి కల్యాణమండపం నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమయ్యే కార్మిక కవాతులో ఆర్టీసీ కార్మికులు ఖాకీ యూనిఫాం ధరించి పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎండి అబ్బాస్

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ హత్యాకాండను ఆపాలి

- సిపిఐ, సిపిఎం నేతలు అజీజ్‌పాషా, ఎండి అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ హత్యాకాండను ఆపాలనీ, ఈ విషయంలో ప్రపంచ దేశాలు చొరవ తీసుకోవాలని మాజీ ఎంపి, సిపిఐ సీనియర్ నేత సయ్యద్ అజీజ్‌పాషా, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఉర్దూఘర్‌లోని రాజకీయ పార్టీల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న దాష్టీక దాడులను తీవ్రంగా ఖండించారు. పాలస్తీనా జాతి హత్యాకాండ జరుగుతున్నదనీ, ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో నిరసన వెల్లువ వస్తున్నప్పటికీ అంతర్జాతీయ సమాజ అభిప్రాయాన్ని కూడా అమెరికా బేఖాతర్ చేస్తూ ఇజ్రాయిల్ దుర్మార్గాలకి అండగా నిలబడుతున్నదని విమర్శించారు. అమెరికా తన సామ్రాజ్యవాద నిజస్వరూపాన్ని బయటపెట్టుకుంటున్నదని విమర్శించారు. గాజా భూభాగం మొత్తం తనకు కావాలనీ, పాలస్తీనా ప్రజలు ఆ ప్రదేశాన్ని ఖాళీ చేసి వెళ్ళాలని ట్రంపు నిసిగ్గుగా ప్రకటించడం అత్యంత దుర్మార్గమని అన్నారు. పాలస్తీనా ప్రజల మాతృభూమిని లాక్కునే కుట్రలని ప్రజలందరూ ఖండించాలని కోరారు. ఇజ్రాయిల్ చర్యలు మానవ హక్కుల ఉల్లంఘన, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని ఆయన అన్నారు. పాలస్తీనా ప్రజల ఆత్మగౌరవం, స్వాతంత్ర్యం కోసం జరుగుతున్న పోరాటానికి సంఘీభావం తెలిపారు. పిల్లలు, మహిళలు, అమాయక పౌరులపై జరుగుతున్న హింసను వెంటనే ఆపాలనీ, గాజాలో బాంబు దాడులను నిలిపేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం, సిపిఐ పార్టీలు పాలస్తీనా ప్రజల స్వాతంత్ర్య పోరాటానికి ఎల్లప్పుడూ మద్దతిస్తాయనీ, ఈ హింసాత్మక దాడులను అంతర్జాతీయ సమాజం ఖండించాలని సదస్సు ద్వారా పిలుపు ఇస్తున్నామని అన్నారు. ఈ సమస్యపై అంతర్జాతీయ సమాజం తక్షణ చర్యలు తీసుకోవాలనీ, శాంతి న్యాయం కోసం కృషి చేయాలని కోరారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు, మేధావులు అఫ్జల్, ఖుద్దూస్ ఘోరీ, ఉస్మాన్ హల్ హాజరి, అన్వర్ ఖాన్, ముజాయిద్ హష్మీ, మునీర్ పటేల్ తదితరులు పాల్గొని పాలస్తీనా ప్రజలకు మద్దతుగా తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ దాడులను నిలిపివేయాలని, పాలస్తీనా ప్రజలకు న్యాయం చేయాలని సమావేశంలో ఒక తీర్మానం చేశారు.

సామాజిక అంశాల కవిత్వం ప్రజలకు చేరువ అవుతుంది

- ప్రముఖ కవి డాక్టర్ ఎన్ గోపి

ప్రజాశక్తి కల్చరల్

సామాజిక అంశాల నేపథ్యంలో రాసిన కవిత్వం ప్రజలకు చేరువవుతుంది అని ప్రేముఖ కవి డాక్టర్ ఎన్ గోపి అన్నారు. కళా కుసుమాలు సంపుటిలోని కవితలులో కుసుమ సుకుమారం మాత్రమే కాకుండా సమాజ పరిస్థితుల పట్ల అవేదన ఆక్రోశం ఆగ్రహం కూడా వుందని అయన వివరించారు. రవీంద్ర భారతి లోని సమావేశ మందిరంలో భాషా సాంస్కతిక శాఖ సౌజన్యంతో ఆనంద లహరి సాంస్కతిక సంస్థ నిర్వహణలో కళావతి కందగట్ల రచించిన కళా కుసుమాలు కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ గోపి సంపుటినీ ఆవిష్కరించి మాట్లాడారు. భాష పద ప్రయోగం లో వైవిధ్యం కళావతి తమ కవితలలో చూపారని వివరించారు. కుసుమ ధర్మన్న కళా పీఠం అధ్యక్షురాలు డాక్టర్ రాధా కుసుమ అధ్యక్షత వహించి కళా కుసుమాలు పరిమళించిన కవితల సంపుటి అని అభివర్ణించారు దంత వైద్యులు డాక్టర్ కె ఎల్‌వి ప్రసాద్ బాల సాహిత్య రచయిత చొక్కాపు రమణ కలం స్నేహం సంస్థ జాతీయ ఉపాధ్యాక్షులు హరి రమణ లింగాల సంధ్య రాణి పాల్గొన్న సభలో కళావతి సంపుటిని తన భర్త మైము కళాధర్ కు లాంఛనంగా అంకితమిచ్చారు.

త్యాగరాజ కీర్తనలు రాష్ట్రమంతా ప్రచారం చేస్తాం

- త్యాగరాజ జయంతి వేడుకల్లో మంత్రి జూపల్లి ప్రకటన

ప్రజాశక్తి కల్చరల్

శాస్త్రీయ సంగీతాన్ని ఊపిరిగా భావించి అదే ధ్యాస అదే శ్వాసగా వున్న సంగీత కళాకారులకు త్యాగరాజ స్వామి ఆరాధ్యుడు అని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కర్ణాటక శాస్త్రీయ సంగీత సామ్రాజ్యానికి త్యాగయ్య చక్ర వర్తి కావటంతెలుగు వారందరికీ గర్వకారణం అని ఆయన చెప్పారు. ఆయన కీర్తనలు గ్రామ గ్రామాన ప్రచారం చేస్తామని మంత్రి ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వ సంగీత నాటక అకాడమి ఆధ్వర్యంలో బషీర్ బాగ్ లాల్ బహదూర్ శాస్త్రి ఇండోర్ స్టేడియంలో ప్రముఖ వాగ్గేయకారులు శ్రీత్యాగరాజ స్వామి 258వ జయంతి మహోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జ్యోతి ప్రకాశనం చేసి ఉత్సవాలను ప్రారంభించారు. గాయకులతో కలసి పంచరత్న కీర్తనల గాన గోష్టిలో కూర్చుని ఆలాపన చేస్తూ ఉత్సాహపరచారు. త్యాగరాజు విరచిత పంచరత్న కీర్తనలను వింటూ ఆయన్ని స్మరించుకోవడం గొప్ప అదష్టభాగ్యం అని మంత్రి జూపల్లి కష్ణారావు అన్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితాల్లో యువత మరింత ఒత్తిడికి గురవుతున్నారని, అనారోగ్య సమస్యలు చుట్టుముట్టి అనేక ఇబ్బందులు పడుతున్నారని త్యాగయ్య అన్నమయ్య రామదాసు కేర్తనలు, నృత్యాలు మానసిక ప్రశాంతత చేకూరుస్తాయని ఆయన వివరించారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ ప్రొఫెసర్ డాక్టర్ అలేఖ్య పుంజాల మాట్లాడుతూ తంజావూరు స్థాయిలో త్యాగరాజు ఆరాధనోత్సవాలు మాదిరిగా ప్రతి యేటా త్యాగరాజు ఉత్సవాలు నిర్వహించాలని, సంగీత నత్య కళాకారుల్లో ఐక్యత కోసం విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతం మనసుకు ఎంతో ఉల్లాసాన్ని అందిస్తుందని, భక్తిభావాన్ని పెంపొందిస్తుందని, త్యాగయ్య అన్నమయ్య కీర్తనలు పాడినా, విన్నా యువతకు స్ఫూర్తినిస్తాయని వివరించారు. ఈ వేడుకలో తెలంగాణ బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, పద్మశ్రీ డా శోభారాజు, పద్మశ్రీ డా యెల్లా వెంకటేశ్వరరావు, హైదరాబాద్ సిస్టర్ హరిప్రియ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వందలాది సంగీత బందాలు త్యాగరాజు కీర్తనలు గానం చేసి అలరించారు.

వడ్డెర గోపన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి ఉత్తమ్

కులగణనలో తెలంగాణా రోల్ మోడల్

- రాహుల్ గాంధీ ఒత్తిడితోటే దిగి వచ్చిన కేంద్రం
- వడ్డెర గోపన్న వర్తమానానికి స్ఫూర్తిదాయకం : మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

కులగణనలో తెలంగాణా రాష్ట్రం యావత్ భారతదేశానికే రోల్ మోడల్ గా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఒత్తిడి మేరకే కేంద్రం దిగివచ్చి కులగణన చేపట్ట బోతుందని ఆయన తెలిపారు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పారదర్శకంగా కులగణన నిర్వహించామన్నారు. ఆటువంటి కులగణన కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘనికి తాను చైర్మన్‌గా ఉండడం తనకెంతో గర్వకారణమన్నారు ఆదివారం కోదాడ నియోజకవర్గ కేంద్రంలో స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డెర గోపన్న విగ్రహాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కల ఆధ్వర్యంలో రాష్ట్ర శాసనసభ బి.సి లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీర్మానం చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు శాసనసభలో తీర్మానం చేయడమే కాకుండా గవర్నర్ తో ఆమోదం పొంది రాష్ట్రపతికి పనించామన్నారు. దివంగత వడ్డెర గోపన్న చిరస్మరణీయుడు అని,స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర చరిత్రలో అజరామరంగ నిలిచి పోతుందని ఆయన కొనియాడారు . ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి కి సైన్యాధ్యక్ష్యుడుగా ఉంటూ తెల్ల దొరల మీద చేసిన వీరోచిత పోరాటం వర్తమానానికి స్ఫూర్తి దాయకాంగ నిలుస్తోందన్నారు వడ్డెరల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.సమజాభివద్ధిలో వారి కషి వేల కట్టలేనిదని ఆయన కొనియాడారు.

విద్యుత్ వినియోగంలో..

తెలంగాణ టాప్ గేర్

- రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లను దాటేసిన తెలంగాణ
- మార్చిలో 9,951 మిలియన్ యూనిట్ల వాడకం
- దేశంలో 6వ స్థానంలో రాష్ట్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ వినియోగంలో పెద్ద రాష్ట్రాలను సైతం వెనక్కి నెట్టి తెలంగాణ దూసుకెళుతోంది. జనాభా, వైశాల్యాల పరంగా పెద్దవైన రాజస్థాన్, మధ్యప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాలకన్నా మార్చిలో తెలంగాణలో అధిక కరెంటు వినియోగం నమోదైంది. దేశంలో తెలంగాణ 6వ స్థానంలో ఉన్నట్లు కేంద్ర విద్యుత్ మండలి (సీఈఏ) తాజా నివేదిక-2024-25లో వెల్లడించింది. ఈ ఏడాది మార్చిలో అత్యధికంగా మహారాష్ట్ర 20,400 మిలియన్ యూనిట్ల(మి.యూ.) వినియోగంతో తొలిస్థానం సాధించగా దాని తర్వాత వరుసగా గుజరాత్(13,985), తమిళనాడు(11,676), ఉత్తర్‌ప్రదేశ్(11,395), కరా?టక(10,496), తెలంగాణ(9,951) నిలిచాయి. తెలంగాణలో 2024 మార్చిలో 9,009 మి.యూ.లను వినియోగించగా సరిగ్గా ఏడాది తర్వాత 10.5% వ ద్ధి నమోదవడం గమనార్హం. తమిళనాడులో వినియోగం 11,929 నుంచి 11,676 మి.యూ.లకు పడిపోవడంతో వృద్ధిరేటు మైనస్ 2.1శాతంగా నమోదైంది.

పరిశ్రమలు, వ్యవసాయం, ఇళ్లలో కరెంటు వాడకం అధికమైనందునే తెలంగాణలో వృద్ధిరేటు రెండంకెల స్థాయిని దాటినట్లు సీఈఏ వివరించింది. అభివృద్ధి చెందిన రాష్ట్రాలుగా పేరున్న మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, పంజాబ్‌లలో ఈ స్థాయి వృద్ధిరేటు లేకపోవడం గమనార్హం. ఇక తెలంగాణలో రోజువారీ గరిష' డిమాండు సైతం 2025 మార్చి 20న అత్యధికంగా 17,162 మెగావాట్లుగా నమోదైంది. అంతకుముందు ఈ రికార్డు 2024 మార్చి 8న 15,623 మెగావాట్లుగా ఉన్నట్లు సీఈఏ వివరించింది. వ్యవసాయానికి తెలంగాణలో 24 గంటల ఉచిత సరఫరా ఉన్నందున డిమాండు, వినియోగంలో వ ద్ధిరేటు అధికంగా ఉంటోంది. ఏటా మార్చిలో రబీ పంటలు సాగులో ఉంటాయి. రాష్ట్రంలో 29 లక్షలకుపైగా ఉన్న వ్యవసాయ బోర్లను మార్చిలో అధికంగా వాడటంతో డిమాండు రికార్డు స్థాయిలో పెరుగుతోంది.

ఆశలు రేపుతున్న హరిత ఇంధనం

దేశంలో పునరుద్ధరణీయ/హరిత ఇంధనం(రెన్యూవబుల్ ఎనర్జీ-ఆర్ఈ) ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరుగుతున్నట్లు సీఈఏ తెలిపింది. దేశవ్యాప్తంగా ఈ విద్యుదుత్పత్తి 2024 మార్చిలో 26.30 బిలియన్ యూనిట్లు(బీయూ) ఉండగా ఏడాది వ్యవధిలోనే 25.11శాతం అదనంగా పెరిగి 32.90 బీయూలుగా నమోదైంది. ఇందులో సౌరవిద్యుత్ వాటా ఎక్కువగా ఉంది. సంప్రదాయ థర్మల్ విద్యుదుత్పత్తి పెరుగుదల 3.70శాతం మాత్రమే ఉండటం గమనార్హం. ఒక బీయూ అంటే వంద కోట్ల యూనిట్లు. 2024-25లో దేశవ్యాప్తంగా మొత్తం 1,829.69 బీయూల కరెంటు ఉత్పత్తవగా అది 2023-24లో 1,739 బీయూలుగా నమోదైంది. ఏడాది వ్యవధిలో అన్ని రకాల విద్యుదుత్పత్తి 5.21శాతం అదనంగా పెరిగింది.

దేశవ్యాప్తంగా అన్ని రకాల విద్యుత్ ప్లాంట్ల స్థాపిత ఉత్పత్తి సామర్థ్యం 4,75,211.80 మెగావాట్లకు చేరింది. ఇందులో ఆర్ఈ ప్లాంట్ల సామర్థ్యం 2.20 లక్షల మెగావాట్లు. దీన్ని 2030 నాటికి 5 లక్షల మెగావాట్లకు చేర్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. దీన్ని తెలంగాణలో 2030 నాటికి 20 వేల మెగావాట్లకు చేరుస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కేంద్రానికి రాతపూర్వకంగా తెలిపింది.

ఈ నెలలోనే కొత్త రికార్డు?

దేశవ్యాప్తంగా రోజువారీ విద్యుత్ గరిష్ట డిమాండు 2024 మే 30న 2.50 లక్షల మెగావాట్లుగా నమోదైంది. ప్రస్తుత మే నెలలోనే ఈ రికార్డు చెరిగిపోయి 2.55 లక్షలకు చేరవచ్చని ప్రాథమిక అంచనా. సాధారణంగా ఉత్తరాది రాష్ట్రాల్లో మేలో డిమాండు అధికంగా ఉంటుంది. తెలంగాణలో మార్చిలో ఉన్నంత డిమాండు మేలో ఉండదు. ఇక్కడ వేసవిలో పంటల సాగు లేకపోవడమే ఇందుకు కారణంగా అధికారులు తెలిపారు.

ఔటర్‌పై రోడ్డు ప్రమాదం

- ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పరిధిలోని ఓఆర్ఆర్‌పై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముందు వెళ్తున్న కంటైనర్‌ను వెనక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారు వెనక సీట్లో కూర్చున్న మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. బీదర్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఒకరి తలకు బలమైన గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతులు హైదరాబాద్ నగరంలోని మేడిపల్లి, బోడుప్పల్‌కు చెందిన యశ్వంత్ (25), చార్లెస్ (25)గా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరు మృతి

సిద్దిపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మార్కుక్ మండలం కావేరి కంపెనీ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు.

సామాజిక తెలంగాణ ఎందుకు సాధించలేదు

- ఎమ్మెల్సీ కవితకు జగ్గారెడ్డి ప్రశ్న

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో సామాజిక తెలంగాణ ఎందుకు సాధించలేదని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ప్రశ్నించారు. అధికారం కోల్పోయిన తర్వాత సామాజిక తెలంగాణ సాధించాలంటూ ఆమె కొత్త రాగం అందుకున్నారని ఎద్దేవా చేశారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బిఆర్ఎస్ పార్టీ అధికారం పోయాక ఆమె చాలా పెద్ద మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్న సమయంలో గుర్తుకు రాని మాటలు ఇప్పుడు యాదికొస్తున్నాయని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు సామాజిక తెలంగాణ గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. ప్రజాపాలన గొంతు విప్పి మాట్లాడే స్వేచ్ఛ ఇచ్చిందని తెలిపారు. కొత్త కొత్త రాగాలు ఎంచుకుని...నటించడం కవితకు, వారి కుటుంబానికే సాధ్యమని ఎద్దేవా చేశారు. ఇందిరా పార్క్ కాదు...కాంగ్రెస్ పార్టీ ఆయా కలెక్టర్ కార్యాలయాల ముందు కూడా ధర్నా చేసే స్వేచ్ఛ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి

ప్రభుత్వాల మెడలు వంచేలా ఉద్యమం

ఆదాయ వనరులు పెంచకుండా పన్నుల భారం పెంచుతున్న కేంద్రం

సమస్యల పరిష్కారం సిఐటియు, ఎర్రజెండాతోనే సాధ్యం : చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాల మెడలు వంచేలా ఉద్యమాలు నిర్మించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బాలమణి అధ్యక్షతన రెండవ రోజు ఆదివారం మెదక్ జిల్లా రామాయంపేటలో సిఐటియు జిల్లా మహాసభలు అట్టహాసంగా జరిగాయి. ముందుగా పట్టణంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక మహేష్ సాయి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమ పథకాలపై కోత విధిస్తున్నారని ఆరోపించారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుతుంటే భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతుండటం దుర్మార్గమన్నారు. నిత్యవసర ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని, జీఎస్టీ పేరుతో సామాన్యులపై పన్నుల భారం వేస్తున్నారన్నారు. మన ఆదాయాలు పెంచకుండా, మన సొమ్మును పన్నుల పేరుతో కొల్లగొట్టడం దారుణమన్నారు. నిరుద్యోగ సమస్య దేశంలో తీవ్రంగా పెరిగిందని, నూటికి 90శాతం మంది అసంఘటిత కార్మికులుగానే ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఎన్నికలప్పుడు ఎన్నో హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీని ఎన్నుకుంటే, హామీలు అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. బీడీ కార్మికులు ఎన్నో ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ కూడా జీవనం కోసం ఆ వృత్తిని కొనసాగిస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించకపోవడం దుర్మార్గమన్నారు. కుటుంబానికి రూ.178లు ఆదాయం సరిపోతుందని కేంద్రంలోని మోడీ అంటే, ఇక్కడ కార్మికులకు వేతనాలు పెంచాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం దాన్ని ఖండించకుండా తప్పించుకుంటుందని ఆరోపించారు. పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

మహాసభలో మాట్లాడుతున్న చుక్క రాములు

అసంఘటిత రంగాల కార్మికుల కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ ఉద్యోగులు వేసవి సెలవులు కావాలంటే, సెలవులు ఇచ్చామని చెప్తూ జీవోలో మాత్రం, సెంటర్ తెరిచి ఉండాలని తిరకాసు పెట్టారన్నారు. ఆశా వర్కర్లు పోరాడగా పెంచిన వేతనాలను, ఇప్పటికీ వారికి ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.కార్మికులను కట్టు బానిసలుగా చూస్తున్న నరేంద్ర మోడీ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్, బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోపాలస్వామి, జిల్లా అధ్యక్షకార్యదర్శులు సర్దార్, ఏ.మల్లేశం,ఉపాధ్యక్షులు అన్నపూర్ణ, మహేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు నాగరాజు, లాహెర్, నాగిరెడ్డి, ఆసిఫ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లేశం, సంగారెడ్డి సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి సాయిలు పలు రంగాల కార్మికులు పాల్గొన్నారు.

రోహింగ్యాల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం

- కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోహింగ్యాల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న అలసత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాస్‌పోర్టు, వీసా లేని విదేశీయులను గుర్తించి పంపించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తూతూ మంత్రంగా వ్యవహరిస్తోందని, ఇది దేశ భద్రతకు ముప్పుగా మారవచ్చన్నారు. ఆదివారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం నీటి ప్రాజెక్టుపై ఎన్డీఎస్ఏ నివేదిక వచ్చిందని, అయినా చర్యలు తీసుకోని ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందన్నారు. బిఆర్ఎస్ అవినీతికి కాంగ్రెస్ అండగా మారిందని, రెండు పార్టీలు కలసి మావోయిస్టులతో చర్చలు అంటూ ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నంలో ఉన్నాయన్నారు. మోడీ ప్రభుత్వం చేపట్టిన కులగణన చారిత్రాత్మకమని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేసిన సర్వేలో బీసీ జనాభాను తక్కువగా చూపించారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని వ్యవహారాల్లో విఫలమైందని, ఆరు గ్యారంటీల అమలుపై డమ్మీ డ్రామాలతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. మావోయిస్టులతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని, వారు తుపాకీ వదిలి పోలీసులకు లొంగిపోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వాసాల రమేష్, మాజీ మేయర్ సునీల్ రావు, కొత్తపల్లి మాజీ మున్సిపల్ చైర్మెన్ రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొనండి

- మంత్రి కోమటిరెడ్డికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలోని ఆసిఫాబాద్, హైదరాబాద్ జిల్లాలో సోమవారం జరగనున్న జాతీయ రహదారుల ప్రాజెక్టుల శంకుస్థాపన, ఆ శాఖకు సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆమేరకు ఆదివారం లేఖ రాశారు. గడ్కరీ ఢిల్లీ నుంచి సోమవారం ఎనిమిది గంటలకు బేగంపేట్ విమానశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో ఆసిఫాబాద్ జిల్లాకు చేరుకుంటారు. జాతీయ రహదారికి శంకుస్థాపన చేసినంతరం ఆయన హైదరాబాద్‌కు చేరుకుని వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పై కాంగ్రెస్ నిర్లక్ష్యం

- మాజీ మంత్రి టి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరితో విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా విమర్శించారు. బడా కాంట్రాక్టర్లకు రూ. వేల కోట్ల బిల్లులు చెల్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలను ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. విద్యార్థుల చదువును, వారి జీవితాలను కాంగ్రెస్ సర్కార్ ప్రశ్నార్థకం చేస్తున్నదని ఆరోపించారు. "రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలలకు దాదాపు రూ.800 కోట్ల మేర ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించక పోవడంతో 6లక్షల మంది విద్యార్థులకు నష్టం జరిగే ప్రమాదముంది. డిగ్రీ పరీక్షలు నిర్వహించా లని విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకునే దుస్థితి రావడం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనం. సకాలంలో పరీక్షలు నిర్వహించక పోవడంతో పీజీసెట్, లాసెట్, ఇతర పోటీ పరీక్షలు రాయడానికి మూడో సంవత్సరం విద్యార్థులు అర్హత కోల్పోతున్నారు. ఇంత జరుగుతున్నా సీఎం, మంత్రులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు" అని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా సగటున రూ. రెండు వేల కోట్ల చొప్పున తొమ్మిదిన్నరేండ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం మొత్తం రూ.19 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 17 నెలల్లో 17 పైసలు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద విడుదల చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులు తమ విద్యా సంవత్సరాన్ని కోల్పోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

శాత్రాజ్‌పల్లిలో 30 పడకల ఆస్పత్రి

- వేములవాడను వైద్యానికి హబ్‌గా మారుస్తాం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాత్రాజ్‌పల్లిలో 30పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, ఈ ప్రాంతం వైద్యానికి హబ్‌గా మారుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రజలకు కనీస సౌకర్యాలు, మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ పరిధిలోని శాత్రాజ్‌పల్లిలో రూ.1.43కోట్లతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) నిర్మాణానికి ఆదివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలిసి శంకుస్థాపన చేసి భూమి పూజ నిర్వహించారు. అలాగే, వేములవాడ పట్టణంలో తిప్పాపూర్ బస్టాండ్ నుంచి చెక్ డ్యామ్ వరకు, మిగిలిన బండ్ అభివద్ధి, సుందరీకరణ పనులకు ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శాత్రాజ్‌పల్లి చైతన్యవంతమైన ప్రాంతమని, ఎందరో ప్రభుత్వ ఉద్యోగులను అందించిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. సైడ్ డ్రైన్ నిర్మాణానికి రూ.12లక్షల నిధులు మంజూరు చేశామని తెలిపారు. తిప్పాపూర్ నుంచి మూలవాగు ఎడమవైపు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు రూ.80 లక్షలతో సుందరీకరణ పనులు ప్రారంభించామన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధికి పెద్దపీట వేశామని, ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించినట్టు తెలిపారు. రాజన్న గుడి చెరువులోకి మురుగు నీరు కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో ఈ హెల్త్ సెంటర్ ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజు, వైస్ చైర్మెన్ రాకేష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, స్థానిక ప్రజాప్రతినిధులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, సంఘ స్వామి యాదవ్, వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ కళాశాల నిర్వాహకులపై క్రిమినల్ కేసు పెట్టండి

- లుబ్నా సర్వత్, వెంకటేశ్‌లకు మధుయాష్కీ సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నకిలీ నర్సింగ్ కళాశాలను నడుపుతూ విద్యార్థినులను మోసం చేసిన నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెట్టాలని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ సూచించారు. హైదరాబాద్‌లోని మెహదీపట్నంలో గుర్తింపు లేని నైటింగేల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ చేరి మోసపోయిన 51 మంది విద్యార్థినులకు సామాజిక కార్యకర్తలు లుబ్నా సర్వత్, టిపిసిసి ప్రచార కమిటీ సభ్యులు ఆంగోతు వెంకటేష్ అండగా నిలిచారు. వారు మధుయాష్కీ సహకారంతో ఆ విద్యార్థినులను నకిలీ కళాశాల చెర నుంచి విడిపించారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి కళాశాలలో అడ్మిషన్లు ఇప్పించి, ఆ విద్యార్థినుల భవిష్యత్తును నిలబెట్టారు. ఈ నేపథ్యంలో విద్యార్థినిలు ఆదివారం గాంధీ భవన్‌లో మధుయాష్కీని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బాధిత విద్యార్థులకు, వారిపక్షాన నిలబడ్డ వారికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. సిఎంగా, విద్యాశాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి, హెల్త్ మినిస్టర్‌గా దామోదర రాజనర్సింహ ఉన్నారనీ, ఏ సమస్య ఉన్నా తాము పరిష్కరిస్తామని తెలిపారు. శ్రద్ధగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థినీలకు సూచించారు.

పంచాయతీల్లో పైసల్లేవ్

- ఆగిన 15వ ఆర్థిక సంఘం నిధులు
- కుంటుపడిన మౌలిక వసతులు, అభివృద్ధి
- సర్పంచ్ ఎన్నికలపై వీడని సందిగ్ధం
- జీతాలు అందక కార్మికుల తిప్పలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీలకు పైసల్లేక మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పడకేసింది. కనీసం చెత్త సేకరణ, తాగునీటి సరఫరా వంటి పనులకు కూడా పైసల్లేని దుస్థితి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (ఎస్ఎఫ్‌సీ) నిధులే కాదు జనరల్ ఫండ్స్‌కు కూడా తిప్పలేర్పడటంతో పంచాయతీల్లో పరిపాలనా వ్యవహారాల్ని చూడలేమంటూ సెక్రటరీలు చేతులెత్తేస్తున్నారు. గ్రామ పంచాయతీలకు పాలక వర్గాల్లేకపోవడంతో కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు ఆపేశారు. పంచాయతీలకు ఐదేండ్ల గడువు ముగియగానే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా.. ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత లేదు.

73, 73వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకు అధికారాలు కట్టబెట్టారు. ఐదేండ్లకోసారి విధిగా ఎన్నికలు నిర్వహించాలి. 2019 ఫిబ్రవరిలో కొలువుతీరిన గ్రామ పంచాయతీ పాలక వర్గాల ఐదేండ్ల పదవీ కాలం 2024 ఫిబ్రవరిలో ముగిసింది. అంతకు ముందే పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలి. కానీ, రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల్లో ప్రత్యేక పాలన అమలు చేస్తోంది. ఏడాది దాటినా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో స్పష్టత లేదు. రాష్ట్రంలో 32 జిల్లా పరిషత్‌లు, 620 మండల పరిషత్‌లు, 12769 గ్రామ పంచాయతీల వ్యవస్థ ఉంది. వీటన్నింటికీ పాలక వర్గాల్లేవు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో ప్రత్యేక అధికారుల పాలనే కొనసాగుతోంది. రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలి. అయితే, పాలక వర్గాలు ఉంటే తప్ప నిధులివ్వకూడదనే మార్గదర్శకాలున్నందున కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి.

ఆగిపోయిన 15వ ఆర్థిక సంఘం

15వ ఆర్థిక సంఘం 2021 నుంచి 2026 వరకు అమల్లో ఉంటుంది. ఐదేండ్ల ప్రణాళికలో భాగంగా గ్రామ పంచాయతీలకు జనాభా ఆధారంగా మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి కోసం 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదల చేస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి 15వ ఆర్థిక సంఘం నుంచి కేటాయించిన రూ.1514 కోట్ల నిధులు ఆగిపోయాయి. గ్రామ పంచాయతీలకు పాలన వర్గాల్లేనందున నిధులివ్వడం వీలుకాదని కేంద్రం తేల్చి చెప్పింది. మార్చి 31 వరకు ఎన్నికలు నిర్వహిస్తే నిధులు వస్తాయన్న ఆశ ఉండేది. 15వ ఆర్థిక సంఘం నుంచి 2020-21 నుంచి 2023-24 వరకు రాష్ట్రానికి రూ.6051 కోట్ల నిధులు రాగా, 2024-25 సంవత్సరానికి సంబంధించి పైసా విడుదల కాలేదు. 2023-24లో కూడా రూ.1430 కోట్లు కేటాయించిన కేంద్రం పాలక వర్గాల గడువును లెక్కించి అందులోనూ రూ.6 కోట్ల నిధుల్ని ఆపేసింది. గత ఆర్థిక సంవత్సరంలో ఆగిపోయిన నిధుల్ని ఈ ఆర్థిక సంవత్సరంలో విడుదల చేస్తారా..? చేయరా..? అనేది రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరపకపోతే ఈ ఏడాది కూడా నష్టపోవాల్సి వస్తుంది.

పడకేసిన పల్లెలు

ఏడదికిపైగా గ్రామ పంచాయతీల్లో పాలక వర్గాల్లేకపోవడం వల్ల పల్లెలు పడకేశాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన స్టేట్ ఫైనాన్స్ కమిషన్(ఎస్ఎఫ్‌సీ) నిధులు ఇవ్వడంలోనూ జాప్యం జరుగుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఎస్ఎఫ్‌సీ నిధులివ్వలేదంటే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కూడా నిధులు సరిగ్గా అందట్లేదు. నిధులాగిపోవడంతో గ్రామ పంచాయతీల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రత్యేక అధికారులుగా ఉన్న పంచాయతీ సెక్రటరీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామల్లో నిత్యం పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతకు సంబంధించి చెత్త సేకరణ, చెట్లు, చెతారం తొలగింపు పనులు చేసేందుకు ఉపయోగించే వాహనాలకు డీజిల్ పోయడం కష్టమవుతోంది. ట్రాక్టర్లు, ఆటోలు మరమ్మతులు వస్తే షెడ్లకే పరిమితమవుతున్నాయి. వేసవిలో నీటి ఎద్దడి తీవ్రమైంది. తాగునీటి సరఫరా చేసే బోర్ల మరమ్మతులు, పైపుల లీకేజీలు, కొత్త పైపులైన్ విస్తరణకు పైసల్లేవు.

వీధి దీపాలు, పంచాయతీ కార్యాలయం, బోరు మోటర్ల కరెంట్ బిల్లులు కూడా చెల్లించడం లేదు. మురుగు కాల్వల నిర్మాణం, మరమ్మతులు, బ్లీచింగ్, బయోటెక్స్, పాగింగ్ సామాగ్రికి కూడా డబ్బుల్లేవని కార్యదర్శులు చేతులెత్తేస్తున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలోని కంది, పుల్కల్, చౌటకూర్, నారాయణఖేడ్, కంగ్టి, మునుపల్లి వంటి ప్రాంతాల్లో మంచినీళ్ల కోసం జనం ఖాళీ బిందెలతో రోడ్లెక్కారు. నీటి మట్టం పడిపోయినందున అద్దె బోర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు డబ్బుల్లేవని చెబుతున్నారు. ఇప్పటికే పంచాయతీల నిర్వహణ కోసం కార్యదర్శులు ఉద్దెర పద్ధతిలో సరుకులు తెచ్చి నెట్టుకొచ్చారు. వీధి దీపాలు, పైపులు, నల్లాలు, బ్లీచింగ్, డిజీల్, మరమ్మతుల కోసం దుఖానాల్లో అప్పు పెట్టారు. ఇంటి, వాణిజ్య పన్నులు, లైసెన్స్ ఫీజులు, నిర్మాణ పన్నుల రూపంలో వచ్చిన డబ్బుల్ని కూడా సకాలంలో డ్రా చేసుకునే వీల్లేక అప్పులు కట్టలేకపోతున్నామని పలువురు సెక్రటరీలు ఇటీవల పంచాయతీ రాజ్ కమిషనర్‌ను కలిసి విన్నవించారు.

పస్తుల్లో జీపీ కార్మికులు

గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలివ్వడం లేదు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం జీపీలకు నిధులివ్వకపోవడం వల్ల కార్మికుల జీతభత్యాలు ఆగిపోయాయి. మూడు నెలలకు పైగా జీతాల్లేకపోయినా పస్తులుండి పనిచేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 48 వేల మంది, ఉమ్మడి మెదక్ జిల్లాలో పది వేల మంది జీపీ కార్మికులున్నారు. వీరందరికీ జీతాల్లేకపోవడంతో అనేక సార్లు ధర్నాలు, ఆందోళనలు చేశారు. నిధుల్లేకపోవడం వల్లే జీతాలివ్వడంలేదని కార్యదర్శులు చెబుతున్నారు.

నిధుల సమస్య ఉంది : సాయిబాబు, డీపీఓ సంగారెడ్డి

గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన కొనసాగుతోంది. అభివృద్ధి పనులు కూడా నడుస్తున్నాయి. 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధులు రావాలి. అవి ఆగిపోవడం వల్ల జీపీల్లో నిధుల సమస్య ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామాయంగా నిధుల్ని సమకూరుస్తుంది. జనరల్ ఫండ్స్ స్థానిక అవసరాలకు ఉపయోగిస్తున్నాం.

రోడ్డుపై బైఠాయించిన రైతులు

గన్నీ బ్యాగులు, లారీలు లేవంటూ ఖమ్మం జిల్లాలో రైతుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐకెపి కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరు గ్రామంలో రైతులు ఖమ్మం టూ సూర్యాపేట జాతీయ రహదారిపై ఆదివారం బైటాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కాటా వేయకుండా గన్నీ సంచులు లేవని, కాటా వేసిన వాటిని ప్రభుత్వం లారీలు లేవని సాకులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోళ్లు చేపట్టకపోవడం వల్ల అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యకు తక్షణ పరిష్కారం కావాలని రోడ్డెక్కి బైటాయించినట్టు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు రైతులతో మాట్లాడి నచ్చ చెప్పటంతో రైతులు ఆందోళన విరమించారు.

కెఎల్ హెచ్ యూనివర్సిటీలో ఘనంగా పేస్‌మెంట్ సక్సెస్ మీట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెఎల్ హెచ్ యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్‌లో ఆదివారం ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్ ఘనంగా జరిగింది.ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు అయా కంపెనీ ప్రతినిధుల చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జేపీ. మోర్గన్ కంపెనీ ఉపాధ్యక్షులు మారియో డేవిడ్ మాట్లాడుతూ మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు సంపూర్ణంగా అవగాహన చేసుకుంటే అత్యుత్తమ కేరిర్‌ను సొంతం చేసుకోవచ్చని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా కార్పోరేట్ కంపెనీలు తమ పరిధిని విస్తరిస్తున్నాయనీ, సృజనాత్మక, నైపుణ్యం ఉన్న యువతకు ప్రాధాన్యముంటుందని స్పష్టం చేశారు. యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ సారధి వర్మ మాట్లాడుతూ ఈ ఏడాది రూ.75 లక్షల వార్షిక ప్యాకేజీతో తమ విద్యార్థి ప్లేసెమెంట్ సాధించటం గర్వకారణమని పేర్కొన్నారు. జర్మనీ, జపాన్, సింగపూర్, దుబాయ్, మలేషియా వంటి దేశాల్లో అంతర్జాతీయ ప్లేసెమెంట్స్ దక్కించుకున్నారని తెలిపారు. క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ల రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించటం, పారిశ్రామిక అనుబంధ శిక్షణ ఇవ్వటం ద్వారా తమ విద్యార్థులు అత్యుత్తమ కంపెనీల్లో ఉద్యోగాలు పొందగలుగుతున్నారని తెలిపారు. కేఎల్‌హెచ్ విద్యాసంస్థలో చదివే విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం కింద ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.

సదస్సులో మాట్లాడుతున్న చావ రవి

డిమాండ్ల సాధన కోసం ప్రత్యక్ష కార్యాచరణ

- పోరాడితేనే ప్రభుత్వంలో కదలిక
- తెలంగాణ ఎంప్లాయిస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్
- జెఎసి కో చైర్మన్ చావ రవి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

డిమాండ్ల సాధన కోసం ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవాలని తెలంగాణ ఎంప్లాయిస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్ జెఎసి కో చైర్మన్ చావ రవి సూచించారు. ఆదివారం జెఎసి ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్ అధ్యక్షతన రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చావ రవి మాట్లాడుతూ పోరాడితేనే కదలిక వస్తుందని తెలిపారు. గత ప్రభుత్వమైనా, ఈ ప్రభుత్వమైనా, అది ఏ ప్రభుత్వమైనా సరే పోరాడితేనే స్పందిస్తుందని చెప్పారు. భౌతికంగా పోరాడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మిగిలిన ఎనిమిది జిల్లాల్లో త్వరితగతిన జెఎసిలు ఏర్పాటు చేయాలనీ, రెండు జిల్లాలు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో జిల్లాస్థాయి సదస్సులు నిర్వహించాలన్నారు. జిల్లా సదస్సుల కోసం ఒక్కో జిల్లాలో ఒక్కో సంఘానికి అప్పగిస్తే బాగుంటుందని సూచించారు. కేంద్రంలో బిజెపి అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20న జరుగుతున్న సార్వత్రిక సమ్మెకు కనీసం మద్దతు తెలపాల్సిన బాధ్యత రాష్ట్ర ఉద్యోగుల జెఎసిపై ఉందని ప్రతిపాదించారు. చావ రవి ప్రతిపాదనతో సదస్సులో సార్వత్రిక సమ్మెకు మద్దతు ప్రకటిస్తూ సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది.

సబ్ కమిటీ పిలవలేదు సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి?

-మారం జగదీశ్వర్

ఉద్యోగుల సమస్యలపై వేసిన సబ్ కమిటీ ఇప్పటికీ తమను పిలవలేదనీ, తాము సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని మారం జగదీశ్వర్ ప్రశ్నించారు. గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన మూడు డిఎలతో కలుపుకుని ఐదు డిఎలు పెండింగ్ ఉండగా, ఒక్క డీఏను మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పటికీ చాలా మంది ఉద్యోగులకు నెల మొదటి తారీఖున జీతాలు రావడం లేదని తెలిపారు. చెల్లించాల్సిన రూ.9,000 కోట్ల పెండింగ్ బిల్లులు అలాగే ఉన్నాయని చెప్పారు.

యుద్ధప్రాతిపదికన పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలనీ, కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలనీ, ఈహెచ్ఎస్ పూర్తి స్థాయిలో అమలు చేయాలనీ, సిపిఎస్ రద్దు చేయాలనీ, వేతన సవరణ కమిటీని వెంటనే తెప్పించుకుని 51 శాతం పిట్ మెంట్ అమలు చేయాలని తీర్మానించారు. స్థానికత ప్రాతిపదికన అదనపు పోస్టులు సృష్టించి 317 జీవో అమలు చేయాలనీ, పదోన్నతుల కమిటీలు ఏర్పాటు చేసి సకాలంలో పదోన్నతులు ఇవ్వాలనీ, ఎన్నికల వేళ బదిలీ చేసిన ఉద్యోగులను తిరిగి వారి పూర్వ స్థానాలకు చేర్చాలనీ, 2025 సంవత్సరానికి సాధారణ బదిలీలు మే, జూన్ నెలల్లో చేయాలని కోరారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే 15న జిల్లా, రాష్ట్ర రాజధానిలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శనలు, 9న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా, అంతకు ముందు సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్క్ వరకు ర్యాలీ చేస్తామని సదస్సు హెచ్చరించింది. వీటితో పాటు పని వేళల్లో వర్క్ టు రూల్, మానవాహారాలు-సామూహిక భోజనాలు (ప్రభుత్వ కార్యాలయాల ముందు), పెన్‌డౌన్, సామూహిక సెలవులు తదితర రూపాల్లో కార్యాచరణ ఉంటుందని చెప్పారు.

ఈ సదస్సులో సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, అడిషనల్ సెక్రెటరీ జనరల్ పి.దామోదర్ రెడ్డి, డిప్యూటీ సెక్రెటరీ జనరల్ ఎ.సత్యనారాయణ, కో చైర్మెన్లు రవీందర్ రెడ్డి, జి.సదానందం గౌడ్, దాస్య నాయక్, తిరుపతి, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, లింగారెడ్డి, వైస్ చైర్మెన్లు ఎస్ఏ.హుసేని (ముజీబ్), చంద్రమోహన్, అంజిరెడ్డి, శ్రీధర్, నరహరి, చంద్రశేఖర్ గౌడ్, సత్యనారాయణ రెడ్డి, తిప్పర్తి యాదయ్య, దామోదర్ రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.